సాక్షి ఖమ్మం

శనివారం । 2 । ఆగస్టు । 2025



బయటకొస్తే భయం.. భయం

వీధికుక్కల దాడులు నానాటికీ పెరుగుతుండగా పిల్లలు, వృద్ధులను బయటకు పంపాలంటే జిల్లావాసులు బెంబేలెత్తిపోతున్నారు. 8లో



రెండు ఆస్పత్రులు సీజ్

చికిత్సలో లోపాలతో ఒక ఆస్పత్రి, నకిలీ బిల్లులు సమర్పించినట్లు తేలడంతో ఇంకో ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేశారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
33° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత వాతావరణం చల్లబడుతుంది.

ఆఁ.. ఉన్నాయి అంతే!

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్య నిత్యకృత్యమైంది. అనేక పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఈ విషయంలో బాలికల తిప్పలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. ప్రభుత్వం మరుగుదొడ్ల ఏర్పాటు, మరమ్మతులపై ఏ మాత్రం దృష్టి సారించకపోవడమే కాక పలు చోట్ల నీటి సరఫరా లేకపోవడం.. ఇంకొన్ని చోట్ల తలుపులు బేడాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



కారేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో గడియ లేని టాయిలెట్ల తలుపు

ప్రభుత్వ పాఠశాలల్లో అధ్వానంగా మరుగుదొడ్లు

- పలు స్కూళ్లలో మరుగుదొడ్లు ఉన్నా నీరు కరువు
- కనీస మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా..
- ఫలితంగా విద్యార్థులు, ఉపాధ్యాయినుల ఇబ్బందులు

ఇలా ఉండాల్సిందే..

పాఠశాలలో టాయిలెట్లు, యూరినల్స్ నిర్మాణంపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఉన్నా అమలుకు నోచుకోవడం లేదు. ప్రతీ 30 మంది విద్యార్థులకు ఒక టాయిలెట్, ప్రతీ పది మందికి ఒక యూరినల్ ఉండాలి. కానీ ఎక్కడా ఇలా ఉన్న దాఖలాలు కానరావు. ప్రభుత్వం తరఫున చొరవ లేకపోగా విద్యాశాఖ అధికారులు సైతం పట్టించుకోకపోవడం విద్యార్థుల సమస్యకు కారణమవుతోంది.

ప్రతిపాదనలతోనే సరి

జిల్లాలోని పలు పాఠశాలల్లో టాయిలెట్ల అవసరాన్ని విద్యాశాఖ అధికారులు గుర్తించారు. బాలురకు సంబంధించి 75 పాఠశాలల్లో 75, బాలికలకు సంబంధించి ఆరు పాఠశాలల్లో ఆరు టాయిలెట్లు నిర్మించాలని ప్రతిపాదించారు. అలాగే, 14 పాఠశాలల్లో బాలురకు 103 టాయిలెట్లు, ఐదు చోట్ల బాలికలకు 26 టాయిలెట్ల మరమ్మతులు చేయించాలని పేర్కొన్నగా ప్రతిపాదనల దశ దాటలేదు. కానీ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యాన బాలురకు 89 టాయిలెట్లు, బాలికలకు 21 టాయిలెట్ల మరమ్మతు చేయించారు.

లెక్కలో అంతా సరి...

జిల్లాలో 1,216 పాఠశాలలు ఉండగా పలు స్కూళ్లలో విద్యార్థులు మరుగుదొడ్ల సమస్య ఎదుర్కొంటున్నారు. కానీ అధికారులు మాత్రం అంతా సవ్యంగా ఉన్నట్లు లెక్కలు చూపిస్తుండడం గమనార్హం. జిల్లాలో బాలురకు 4,741 టాయిలెట్లు ఉండగా.. అందులో 4,591 టాయిలెట్లు సక్రమంగా పనిచేస్తున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఇక బాలికలకు 5,871 మరుగుదొడ్లు ఉండగా.. అందులో 5,694 పనిచేస్తున్నాయని తేల్చారు. కానీ చాలా పాఠశాలల్లో మరుగుదొడ్లు అలంకారప్రాయంగా మారాయని విద్యార్థుల ద్వారా తెలుస్తోంది. కొన్నిచోట్ల నీటి సమస్య ఉండగా.. మరికొన్ని చోట్ల పైపులైన్లు ధ్వంసమై, తలుపులు, కిటికీలు దెబ్బతినడంతో ఉపయోగించుకునే వీలుండడం లేదు.

సరిపడినంతగా లేవు..

ఖమ్మం నడిబొడ్డున ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 157 మంది బాలికలు, 278 మంది బాలురు చదువుతున్నారు. గత ఏడాది వరకు ఈ పాఠశాలలో బాలురకు యూరినల్సే లేవు. దీంతో సమీపంలోని పబ్లిక్ టాయిలెట్‌కు వెళ్లేవారు. గత ఏడాది కొత్తగా 16 యూరినల్స్ నిర్మించడంతో కొంత ఇబ్బంది తీరింది. బాలికలకు ఐదు యూరినల్స్, రెండు మరుగుదొడ్లు ఉండగా.. విద్యార్థుల సంఖ్యకు ఇవి సరిపోవడం లేదు. ఇంకా బాలురకు రెండు, బాలికలకు మూడు యూరినల్స్ నిర్మించాల్సి ఉంది. అలాగే, ఈ పాఠశాలలో మహిళా టీచర్లకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు లేకపోవడం గమనార్హం.

మరమ్మతు చేయించాలి..



మా పాఠశాలలో టాయిలెట్లు సరిగా లేవు. పైపులైన్లు పగిలి నీళ్లు సరిగా రావడం లేదు. వచ్చినా వృథా అవుతోంది. గోడలన్నీ బీటలు బారాయి. టాయిలెట్‌కు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉన్నందున మరమ్మతులు చేయిస్తే బాగుంటుంది.
– కె.లాస్య, పదవ తరగతి, కారేపల్లి హైస్కూల్

● నీరు తెచ్చుకోవాలి..

కామేపల్లి మండలం కొమ్మినేపల్లి ప్రాథమిక పాఠశాల మరుగుదొడ్డిలో నీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్డిపై ట్యాంక్ నిర్మించినా బోర్ మోటార్ నుంచి పైపులైను కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో ప్రతిరోజు స్కావెంజర్ నీరు సమకూర్చాల్సి వస్తోంది.



కొమ్మినేపల్లి పాఠశాల మరుగుదొడ్డిలోకి నీరు తీసుకెళ్తున్న స్కావెంజర్

క్యూ కట్టాల్సిందే..

కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 121 మంది బాలురు, 45 మంది బాలికలు చదువుతున్నారు. ఇక్కడ బాలురు, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు ఉన్నా ఇవి సరిపడా లేక క్యూ కట్టాల్సి వస్తోంది. ఇక్కడ పైలైన్ పగిలి నీటి సౌకర్యం లేదు. టాయిలెట్ల తలుపులకు బేడాలు లేకపోవడంతో ఎవరైనా లోనకు వెళ్తే మరొకరు బయట కాపలా ఉండాల్సి వస్తోంది.

పకడ్బందీగా ఆర్‌టీఐ చట్టం అమలు

కమిషనర్లు శ్రీనివాసరావు, భూపాల్

ఖమ్మంసహకారనగర్: గత రెండేళ్లుగా ఆర్‌టీఐ కమిషనర్లు లేని కారణంగా 15 వేలకు పైగా కేసులు పేరుకుపోయాయని, వీటిని త్వరగా పరిష్కరిస్తూ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయడంపై అధికారులు దృష్టి సారించాలని సమాచార హక్కు చట్టం కమిషనర్ పీ.వీ.శ్రీనివాసరావు సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో మరో కమిషనర్ భూపాల్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలనే లక్ష్యంతో ఉన్నందున అధికారులు సహకరించాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యమైతే ప్రజల్లో అనుమానాలు రానున్నందున.. ఎప్పటికప్పుడు అందుబాటులో ఉన్న సమాచారం ఇవ్వాలని సూచించారు. మరో కమిషనర్ భూపాల్ మాట్లాడుతూ ఆర్‌టీసీ చట్టంపై అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని తెలిపారు. అనంతరం పెండింగ్ కేసులపై అప్పీళ్లను స్వీకరించారు. ఆతర్వాత కలెక్టర్ అనుదీప్ మాట్లాడగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డీఆర్‌ఓ పద్మశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిషనర్లు శ్రీనివాసరావు, భూపాల్, కలెక్టర్ అనుదీప్, సీపీ సునీల్‌దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్

రిటైనింగ్ వాల్ పనులపై కలెక్టర్ సమీక్ష

ఖమ్మం మున్నేరు అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి భూసేకరణలో వేగం పెంచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. మున్నేటి రిటైనింగ్ వాల్ నిర్మాణ పురోగతి, అవసరమైన భూసేకరణ, భూనిర్వాసితులకు ఇచ్చే లే ఔట్ పనులపై శుక్రవారం అధికారులతో సమీక్షించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూమి సేకరించడమే కాక, నిర్వాసితులకు స్థలాలు కేటాయించనున్న లేఔట్ అభివృద్ధిపై సూచనలు చేశారు. రైతుల పొలాలకు ప్రత్యామ్నాయంగా ప్లాట్లను కేటాయిస్తున్నందున లేఔట్‌లో అంతర్గత రోడ్లు, వీధి లైట్లు, విద్యుత్ సంబంధిత పనులు చేపట్టాలని తెలిపారు. పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, నీటి పారుదల శాఖ డిప్యూటీ ఈఈ రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమృతం కంటే విలువైనవి తల్లి పాలు

పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ నరేందర్

ఖమ్మంవైద్యవిభాగం: తల్లిపాలు అమృతం కంటే విలువైనవని, బిడ్డ ఎదుగుదలకు దోహదపడతాయని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ మెతుకు నరేందర్ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంసీహెచ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నరేందర్ మాట్లాడుతూ పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లిపాలు పట్టించడం వల్ల రోగ నిరోధక శక్తి వస్తుందని, తల్లికి కూడా ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ఈమేరకు వారం పాటు తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, వివిధ విభాగాల వైద్యులు, ఉద్యోగులు బాబు రత్నాకర్, రాంబాబు, వినాయక్ రాథోడ్, యామిని, కిరణ్‌కుమార్, పవన్‌కుమార్, డి.శాంత కుమారి, శేషు పద్మ, రఘురాం పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతి, సూపరింటెండెంట్ నరేందర్

సాగుకు ఢోకా లేనట్లే...

- సాగర్ ఆయకట్టుకు చేరుతున్న నీరు
- అధికారికంగా త్వరలోనే షెడ్యూల్

ఖమ్మంఅర్బన్: నాగార్జునసాగర్ రెండో జోన్ పరిధిలోని జిల్లాకు సాగునీరు అందుతోంది. అధికారికంగా షెడ్యూల్ ప్రకటించకున్నా శ్రీశైలం నుంచి సాగర్‌కు భారీగా చేరిన కృష్ణా జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌కు, ఆపై 17మండలాల్లో 2.54లక్షల ఆయకట్టుకు నీరు అందుతోంది. పాలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా, ప్రస్తుతం 21 అడుగుల మేర నీరు చేరింది. అంతేకాక ఎగువ నుంచి రోజూ 5వేల క్యూసెక్కుల నీరు చేరుతుండడంతో రెండు వారాలుగా తాగు, సాగునీటి అవసరాల కోసం నిత్యం 2,600 క్యూసెక్కులు విడుదల చేస్తూ బుధవారం నుంచి ఆ మొత్తాన్ని 3,600 క్యూసెక్కులకు పెంచారు. అయితే, సాగు అవసరాలకు షెడ్యూల్ ప్రకటించకున్నా నీరు అందుతుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

షెడ్యూల్ విడుదలైతే వారబందీ

సాగర్ నీటి విడుదలపై అధికారికంగా షెడ్యూల్ వెలువడ్డాక తొలి 20 రోజులు నిరంతరాయంగా అందే అవకాశముంది. ఆపై వారబందీ విధానంలో తొమ్మిది రోజులు విడుదల చేస్తూ ఆరు రోజుల విరామం ఇస్తారు. ఇలా జిల్లాలోని సాగర్ ఆయకట్టులో చివరి భూములకు సైతం నీరు చేరేలా పర్యవేక్షిస్తారు. అయితే, నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు గరిష్ఠ స్థాయిలో నీరు చేరిన నేపథ్యాన వానాకాలం పంటల సాగుకు నీటి సరఫరాలో అంతరాయం ఉండకపోవచ్చని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. కాగా, జిల్లాలో ఆయకట్టు 2.54 లక్షల ఎకరాలు ఉండగా ఇప్పటికే సగం మేర వరి నాట్లు పూర్తయ్యాయి. మునుపెన్నడూ సాగర్ రెండో జోన్‌కు ఆగస్టులో నీరు విడుదల చేయకపోగా.. ఈసారి పరిస్థితులు ఆశాజనకంగా ఉండడంతో పది రోజుల ముందు నుంచే నీరు అందుతుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అలుగు బారుతున్న చెరువులు

గత నెలలో కురిసిన వర్షాలతో జిల్లా వ్యాప్తంగా చెరువుల్లోకి నీరు చేరింది. జిల్లాలో 984 చెరువులకు గాను ఇప్పటికే 69 చెరువులు నిండి అలుగు పోస్తున్నాయి. అలాగే, 85 చెరువుల్లో 25 శాతం, 199 చెరువుల్లో 25నుంచి 50శాతం, 239 చెరువుల్లో 50నుంచి 75శాతం నీరు చేరగా... 392 చెరువుల్లో 75నుంచి 100శాతం మేర నీరు చేరిందని జల వనరుల శాఖ అధికారులు వెల్లడించారు.

న్యూస్‌రీల్

ఖమ్మంలో గ్రానైట్, మార్బుల్ నైపుణ్య శిక్షణ కేంద్రం



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మంత్రి తుమ్మల, తదితరులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో గ్రానైట్, మార్బుల్ వ్యాపారం మరింత అభివృద్ధి చెందేలా ఫిగ్సీ(ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ గ్రానైట్, స్టోన్ ఇండస్ట్రీ) ఆధ్వర్యాన నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు నిర్వాహకులు సంసిద్ధత వ్యక్తం చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పూణేలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం వెళ్లిన మంత్రి తుమ్మల ఫిగ్సీ చైర్మన్ ఇష్వీందర్ సింగ్ ఆహ్వానంతో అక్కడి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా యువతకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను పరిశీలించిన మంత్రి.. ఖమ్మంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించాలని సూచించారు. ఈమేరకు చైర్మన్ రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే సెంటర్ ఏర్పాటు చేస్తామని బదులిచ్చారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ నాయకుడు సాదు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే వ్యాధులు దూరం



పింఛన్‌దారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

కూసుమంచి: ప్రతీఒక్కరు ఇళ్లలోనే కాక పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ అప్రమత్తంగా ఉంటేనే సీజనల్ వ్యాధులు దరిచేరవని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. మండలంలోని పాలేరు, గైగొళ్లపల్లి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. డ్రై డే కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించిన అదనపు కలెక్టర్.. ఇళ్ల ముందు వర్షపు, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అలాగే, గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహణతో జ్వరాలను అదుపు చేయవచ్చని తెలిపారు. కాగా, గైగొళ్లపల్లిలో చేయూత పెన్షన్ల పంపిణీ తీరుపై ఆరా తీసిన శ్రీజ లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కుటుంబానికి చేయూత



చెక్కు అందిస్తున్న ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి

ఖమ్మంవ్యవసాయం: విధినిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన పాడి పరిశ్రమ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కుటుంబానికి రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ రూ.10లక్షల ఆర్థిసాయాన్ని మంజూరు చేసింది. విజయ డెయిరీ ఖమ్మం యూనిట్ పరిధి కామేపల్లి మండలం కొత్తలింగాలలో పదేళ్లుగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పులి నాగేశ్వరరావు శరీరంపై ఇటీవల యాసిడ్ పడింది. ఎక్కడ చికిత్స చేయించినా ఫలితం లేక మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ.10లక్షల సాయం ప్రకటించారు. ఈమేరకు నాగేశ్వరరావు భార్య సుగుణమ్మకు హైదరాబాద్‌లో విజయ డెయిరీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి చెక్కు అందజేశారు.

డ్రగ్ స్టోర్‌ను తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ



రికార్డులు పరిశీలిస్తున్న కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కొనసాగుతున్న సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి బి.కళావతిబాయి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మందుల స్టాక్, రికార్డులు, పీహెచ్‌సీలకు సరఫరా, నిల్వల తీరును పరిశీలించారు. మందుల లభ్యత, గడువును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన మేర స్టాక్ తెప్పించుకోవాలని ఉద్యోగులకు సూచించారు. తద్వారా కొరత ఎదురుకాదని తెలిపారు. అంతేకాకుండా నిల్వల విషయంలో జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ ఆదేశించారు.

మరింత వేగంగా ఆధునికీకరణ పనులు



ఖమ్మం స్టేషన్‌లో ఉద్యోగులకు సూచనలు చేస్తున్న డీఆర్‌ఎం గోపాలకృష్ణన్

రైల్వేస్టేషన్లలో తనిఖీ చేసిన డీఆర్‌ఎం

ఖమ్మం రాపర్తినగర్/మధిర: రైల్వేస్టేషన్లలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం ఎం.గోపాలకృష్ణన్ ఆదేశించారు. జిల్లాలోని ఖమ్మం, మధిర స్టేషన్లలో పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఖమ్మంలో తనిఖీల సందర్భంగా అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని పేర్కొన్న ఆయన ఇకనైనా వేగం పెంచకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈసందర్భంగా ఖమ్మంలో ఎక్సలేటర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, విశ్రాంతి భవన్, రైల్వే స్టేషన్ కార్యాలయం పనులపై సూచనలు చేశారు. అలాగే, మధిర స్టేషన్‌లోని 1, 2వ నంబర్ ప్లాట్‌ఫారంలపై పనులు పరిశీలించిన డీఆర్‌ఎం ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈకార్యక్రమాల్లో ఖమ్మం రైల్వే స్టేషన్ మేనేజర్ సుభాస్ చంద్రబోస్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

తొలిరోజే సాంకేతిక సమస్యలు

యాప్‌లో ఉపాధ్యాయుల హాజరు నమోదు



హాజరు నమోదు చేస్తున్న సహచర ఉపాధ్యాయుడు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల హాజరు నమోదును రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా చేపట్టాలని ఆదేశించింది. అయితే, తొలిరోజు సర్వర్ మొరాయించడంతో రిజిస్ట్రేషన్‌కే చాలా సమయం పట్టిందని ఉపాధ్యాయులు తెలిపారు. అంతేకాక వెనకాల ఎలాంటి రంగులు, డిజైన్లు లేని గోడ అయితేనే యాప్ అనుమతిస్తుండడంతో అలాంటి గోడ ఎంచుకుని ఒకరి తర్వాత ఒకరు హాజరు నమోదు చేసుకున్నారు. -స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ప్రకాశ్‌నగర్ చెక్‌డ్యాం ఎత్తు తగ్గింపు

ప్రత్యేక యంత్రాలతో మొదలైన పనులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ప్రకాశ్‌నగర్‌లో మున్నేటిపై నిర్మించిన చెక్‌డ్యాం ఎత్తు తగ్గింపు పనులు మొదలయ్యాయి. ఈ చెక్‌డ్యాంను రూ.7కోట్లతో నిర్మించగా 2019లో మొదలైన పనులు 2022లో పూర్తయ్యాయి. అయితే, గత ఏడాది మున్నేటి వరద పోటెత్తగా ఈ చెక్‌డ్యాం వద్ద ప్రవాహం అడ్డుపడడంతోనే పరీవాహక ప్రాంతాలకు నష్టం జరిగిందనే అంచనాకు వచ్చారు. ఈమేరకు ఎత్తు తగ్గింపుపై కలెక్టర్ నివేదిక సమర్పించగా ఆయన ఆదేశాలతో శుక్రవారం పనులు మొదలుపెట్టారు. గ్రానైట్ రాళ్లు కట్ చేసేందుకు ఉపయోగించే యంత్రాల సాయంతో దాదాపు 200 మీటర్ల పొడవుతో ఉన్న చెక్‌డ్యాంను కొలత ప్రకారం ఎత్తు తగ్గిస్తున్నారు. కాగా, భూమి లోపలి నుంచి 11 అడుగుల ఎత్తుతో, ఉపరితలంపై ఏడు అడుగులుగా చెక్ డ్యాం ఉంటుంది. ప్రస్తుతం 5.5 అడుగుల మేర తొలగిస్తుండడంతో 1.5 అడుగులు మాత్రమే మిగిలే అవకాశముంది. ఈ పనులను ఖమ్మం రూరల్ తహసీల్దార్ పి.రాం ప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు.



చెక్‌డ్యాం ఎత్తు తగ్గింపు పనుల్లో యంత్రాలు

భిన్నాభిప్రాయాలు

రూ.7కోట్లతో ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేటిపై చెక్‌డ్యాం నిర్మించగా అన్ని కాలాల్లో ఇక్కడ నీరు నిల్వ ఉంటోంది. నగరంలో భూగర్భ జలాలు పెరగడానికి ఇక్కడి నిల్వలే కారణమని చెబుతున్నారు. కానీ నిర్మించిన మూడేళ్లలోనే చెక్ డ్యాం ఎత్తు తగ్గిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది కనీవిని ఎరుగని రీతిలో వరద వచ్చినా ఈ ఏడాది కూడా పరిశీలించాక.. ప్రమాదముందని నిర్ధారణ అయ్యాక తొలగిస్తే బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాంటిదేమీ లేకుండా చెక్‌డ్యాం తొలగిస్తుండడంతో నగరంలో భూగర్భ జలాలపై ప్రభావం పడుతుందని పలువురు చెబుతున్నారు. కాగా, ప్రజల భద్రత దృష్ట్యా చెక్ డ్యాం ఎత్తు తగ్గింపునకు కలెక్టర్ అనుమతి జారీ చేయగా... జలవనరుల శాఖ ఉన్నతాధికారుల అనుమతి కోసం లేఖ రాసినా బదులు రాలేదని సమాచారం.

డీఈఓగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ?

ఖమ్మం సహకారనగర్: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ నాగపద్మజను జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖాధికారిగా నియమించనున్నట్లు తెలిసింది. ఇన్నాళ్లు డీఈఓగా ఉన్న డైట్ ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఆ స్థానంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓకు అదనపు బాధ్యతలు అప్పగించాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఉపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్ నేపథ్యాన ఆమె నియామకంపై శనివారం ఉత్తర్వులు వెలువడే అవకాశముందని సమాచారం.

స్వర్ణ కవచధారణలో రామయ్య

భద్రాచలంటౌన్: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు జరిపించారు.

క్లుప్తంగా

వృత్తి నైపుణ్య శిక్షణ ప్రారంభం

ఖమ్మం రావర్తినగర్: నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య రంగాల్లో ఇచ్చే శిక్షణ ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైంది. కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనుండగా, ఇంకా ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను స్టేడియంలోని జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి సూచించారు. ఆయా కోర్సుల్లో శిక్షణ పూర్తయ్యాక ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వయస్సు, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు పాస్‌పోర్టుతో దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 99482 07271 నంబర్‌లో సంప్రదించాలని డీవైఎస్ఓ సూచించారు.

మధిర కాలేజీ ప్రిన్సిపాల్ కథకు అవార్డు


అవార్డు అందుకుంటున్న జైదాస్

మధిర: మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జైదాస్ రాసిన 'మరో గాలివాన' కథకు ముల్కనూరు సాహితీ పీఠం అవార్డు దక్కింది. ముల్కనూరు సాహితీ పీఠం ఆధ్వర్యాన జాతీయస్థాయి కథల పోటీలు నిర్వహించగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ దేశాల రచయితలు 417కథలను పంపించారు. ఇందులో 70కథలకు అవార్డులు ప్రకటించగా జాబితాలో జైదాస్‌కు సైతం స్థానం దక్కింది. అలాగే, మే 20న హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో జైదాస్ రూపొందించిన కార్టూన్ల పుస్తకం 'జాయ్ టూన్స్'ను సినీనటులు రాజేంద్రప్రసాద్, తనికెళ్ల భరణి ఆవిష్కరించారు.

నేడు కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: సంస్థాగత నియామకాలపై చర్చించేందుకు ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుబంధ సంఘాల అధ్యక్షులు, బ్లాక్, మండల, పట్టణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు హాజరుకావాలని సూచించారు. శనివారం మధ్యాహ్నం 2గంటలకు మొదలయ్యే ఈ సమావేశంలో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జాతీయ కార్యనిర్వాహకులు గంటా వినయ్, రాష్ట్ర సమన్వయకర్త మహ్మద్ జావేద్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

ఎస్‌టీఎఫ్ఐ రజతోత్సవ పతాకావిష్కరణ

ఖమ్మం సహకారనగర్: ఎస్‌టీఎఫ్ఐ(స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) రజతోత్సవాల సందర్భంగా ఖమ్మంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం పతాకాన్ని ఆవిష్కరించారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎస్‌టీఎఫ్ఐ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు చావా దుర్గాభవాని పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానం, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయడంతో పాటు ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. నాయకులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, బుర్రి వెంకన్న, షమీ రాంబాబు పాల్గొన్నారు.

కుర్నవల్లి పీఏసీఎస్ పాలకవర్గం రద్దు

తల్లాడ: అవినీతి ఆరోపణల నేపథ్యాన మండలంలోని కుర్నవల్లి పీఏసీఎస్ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ జిల్లా సహకార అధికారి గంగాధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కుర్నవల్లి సొసైటీ పరిధిలో రూ.2.50 కోట్ల వ్యయంతో రెండేళ్ల క్రితం రైస్‌మిల్లు, దీనికి అనుబంధంగా రూ.52 లక్షలతో రేకుల షెడ్డు నిర్మించారు. అయితే, మే నెలలో వచ్చిన గాలిదుమారానికి షెడ్డు కూలిపోయింది. కాగా, నిర్మాణంలో పాలకవర్గం బాధ్యులు అవినీతికి పాల్పడ్డారని గ్రామానికి చెందిన కొందరు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు డీసీఓకు ఫిర్యాదు చేశారు. ఈక్రమాన విచారణ అనంతరం 15 రోజుల క్రితం సీఈఓ ఒగ్గు నరసింహారెడ్డిని సస్పెండ్ చేయగా, ఇప్పుడు అయలూరి ప్రదీప్‌రెడ్డి చైర్మన్‌గా ఉన్న పాలకవర్గాన్ని రద్దు చేశారు. అలాగే, కుర్నవల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా జి.శ్రీనివాస్ కుమార్‌ను నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,800	4,050
కందులు	6,225	6,225
ఏసీ మిర్చి	14,000	8,000
ఏసీ మిర్చి తాలు	7,800	7,000
మిర్చి	9,500	5,000
పత్తి	7,850	5,400

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.18,052

బయటకొస్తే భయం... భయం

- నానాటికీ పెరుగుతున్న కుక్కల దాడులు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు
- కు.ని. చేస్తున్నామని చెబుతున్నా కానరాని ఫలితం


ఖమ్మంలోని ఓ కాలనీలో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో కుక్కలు హడలెత్తిస్తున్నాయి. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా గుంపులుగా తిరుగుతున్న శునకాలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. చిన్నారులే కాక పెద్దలను కూడా వదలక దాడులు చేస్తుండడంతో వీధుల్లోకి రావాలంటే వణికిపోతున్నారు. ప్రధానంగా రాత్రివేళ కాలనీల్లో రహదారుల మధ్యలో బైఠాయిస్తున్న కుక్కలతో ఆ మార్గంలో వెళ్లాలంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల వెంట పరుగులు తీస్తుండడంతో ప్రమాదాలు జరుగుతుండగా.. కుక్కల దాడిలో గాయపడిన వారు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

గుంపులుగా సంచారం

జిల్లాలో దాదాపుగా అన్నిచోట్ల కుక్కల సమస్య ఉంది. జిల్లా కేంద్రంలోని ఏ కాలనీ, ఏ వీధికి వెళ్లినా గుంపులుగా కుక్కలు కనిపిస్తున్నాయి. శునకాల దాడిలో గాయపడి నిత్యం 30 – 40 మంది ఆస్పత్రులకు వస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కుక్కల భయంతో రహదారులపై తిరిగేందుకు జంకుతుండగా.. పిల్లలను పాఠశాలకు పంపించే తల్లిదండ్రులు తిరిగి వచ్చే ఆందోళనకు గడపాల్సి వస్తోంది. కాగా, శునకాల దాడిలో కొందరికి తీవ్రగాయాలు అవుతుండడంతో నయం కావడానికి నెలల సమయం పడుతోంది. ప్రభుత్వ ఆఆస్పత్రుల్లో రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నా సరైన వైద్యం అందక పలువురు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

ఆస్పత్రులకు క్యూ..

జిల్లాలో కుక్కకాటు బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. దీంతో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వినియోగం పెరిగిపోతోంది. సగటున రోజుకు 30 – 40 మంది కుక్కకాటు బాధితులు ఆస్పత్రులకు వస్తున్నారు. తక్కువ గాయాలైన వారికి నిర్ణీత గడువు ప్రకారం వ్యాక్సిన్ డోస్ వేస్తున్నారు. తీవ్రంగా గాయపడితే ప్రభుత్వ పరంగా సరైన చికిత్స అందక ప్రైవేట్ ఆస్పత్రుల బాట పడుతున్నారు. కొందరు హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రుల్లో 10,895 కుక్కకాటు కేసులు నమోదు కాగా.. ప్రైవేట్ ఆస్పత్రుల గణాంకాలు తీసుకుంటే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. కాగా, కుక్కల సంతతి తగ్గించేందుకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేస్తున్నామని పురపాలికల అధికారులు చెబుతున్నా వాటి సంతతి తగ్గకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

కొన్నేళ్లుగా జిల్లాలో కుక్కకాటు బాధితులు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉపయోగించిన వ్యాక్సిన్

ఏడాది	బాధితులు	వాడిన వ్యాక్సిన్ వాయిల్స్
2020	11,973	16,563
2021	13,120	16,947
2022	14,676	17,996
2023	14,492	20,392
2024	16,224	17,887
2025	10,895	12,889

(ఇప్పటివరకు)

బాలలకు ఆపన్నహస్తం..


ఖమ్మం రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు

- తప్పిపోయిన, పారిపోయి వచ్చిన వారికి ఆర్పీఎఫ్ చేయూత
- చైల్డ్‌లైన్ సహకారంతో కౌన్సెలింగ్
- ఆపై తల్లిదండ్రుల దరికి చేరుస్తున్న వైనం



చేరదీసిన పిల్లలతో ఆర్పీఎఫ్ ఉద్యోగులు (ఫైల్)

ఖమ్మంక్రైం:

→ ఓ రోజు అర్ధరాత్రి పదో తరగతి చదివే బాలిక ఖమ్మం స్టేషన్‌లో రైలు దిగింది. కాసేపటికి 18ఏళ్ల బాలుడు వచ్చి ఆమెతో మాట్లాడుతుండగా ఆర్పీఎఫ్ సిబ్బంది గుర్తించి విచారించగా బాలికది ఒంగోలు అని తేలింది. ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన ఖమ్మం బాలుడిని కలిసేందుకు వచ్చానని చెప్పగా.. ఇద్దరికీ చైల్డ్‌లైన్ సిబ్బంది సహకారంతో కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబీకులకు అప్పగించారు.

→ వారం క్రితం ఆదిలాబాద్‌కు చెందిన ఓ బాలుడు, బాలిక ఖమ్మం రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండగా అనుమానంతో ఆర్పీఎఫ్ సిబ్బంది వివరాలు ఆరా తీశారు. తామిద్దరం ప్రేమించుకున్నా పెద్దలు ఒప్పుకోక ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చామని చెప్పారు. దీంతో ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించగా.. ప్రాణాలు కాపాడిన ఆర్పీఎఫ్, చైల్డ్‌లైన్ బాధ్యులకు వార కృతజ్ఞతలు తెలిపారు.

→ ఐదు రోజుల క్రితం ఓ పదేళ్ల బాలుడు ఇంట్లో తల్లిదండ్రులు తిట్టారని వరంగల్‌లో నుంచి రైలు ఎక్కి ఖమ్మం చేరుకున్నాడు. ఆ బాలుడు ప్లాట్‌ఫాంపై తిరుగుతుండగా ఆర్పీఎఫ్ సిబ్బంది చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. దీంతో వివరాలు తెలుసుకుని తల్లిదండ్రులను అప్పగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఇలా ఒకటి కాదు రెండు నిత్యం ఖమ్మం రైల్వే స్టేషన్‌లో గస్తీ నిర్వహించే ఆర్పీఎఫ్ సిబ్బంది అమాయకులైన చిన్నారుల పాలిట ఆపద్బాంవుల్లా నిలుస్తున్నారు. కొందరు తప్పిపోయి వస్తుండగా.. రకరకాల కారణాలతో ఇంకొందరు ఇళ్లలో చెప్పకుండా వస్తున్నారు. మరికొందరు బాలికలు యువకుల మాయమాటలు నమ్మి వస్తుండడంతో తనిఖీల్లో భాగంగా ఆర్పీఎఫ్ సిబ్బంది చేరదీస్తున్నారు. చైల్డ్‌లైన్ సిబ్బంది సహకారంతో వారికి కౌన్సెలింగ్ ఇస్తూ మెల్లగా వివరాలు సేకరించి తల్లిదండ్రులకు అప్పగించి వారికి గర్భశోకం మిగలకుండా చూస్తున్నారు. కాగా, 2024సంవత్సరంలో 28మంది మైనర్లను కాపాడగా, ఈసంవత్సరం ఇప్పటివరకు 23మందిని కాపాడడం విశేషం.

తల్లిదండ్రుల నిఘా తప్పనిసరి



మైనర్ల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. చిన్న వయస్సులో మొబైల్ ఫోన్లు ఇవ్వొద్దు. ఒకవేళ బయటకు వచ్చి నేరస్తుల కంట పడితే ప్రమాదం ఎదురవుతుంది. కొన్నిప్రాంతాల్లో తప్పిపోయి, పారిపోయి వచ్చిన పిల్లలను చేరదీసినట్లు నమ్మించి విక్రయించే అవకాశముంది. మా వంతుగా స్టేషన్‌లో నిరంతరం తని ఖీలు చేపడుతూ పిల్లలకు ఆపద ఎదురుకాకుండా పర్యవేక్షిస్తున్నాం.

– బుర్రా సురేష్‌గౌడ్, ఆర్పీఎఫ్ సీఐ

కన్నీరే మిగిలింది..

కట్లేరులో గల్లంతైన ముగ్గురు మృతి


మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: కుటుంబ పెద్దలను కట్లేరు మింగేసింది. తమ వాళ్లు బతికి ఉంటారని గంటల తరబడి ఆశగా ఎదురుచూసిన కుటుంబీకుల నిరాశే మిగిలింది. చేపల వేట పేరిట వెళ్లిన ముగ్గురు విగత జీవులుగా ఇళ్లకు చేరడంతో మండలంలోని బంజర గ్రామంలో విషాదం నెలకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు... మండలంలోని బంజరకు చెందిన పలువురు మీనవోలు బ్రిడ్జి వద్ద కట్లేరులో గురువారం చేపల వేటకు వెళ్లారు. అయితే, కట్లేరులో గుంతలను గుర్తించక, ఈత రాని కారణంగా బాదావత్ రాజు(55), భూక్యా కోటి(46), భూక్యా సాయి గల్లంతైన విషయం విదితమే. ఈమేరకు సమాచారం అందుకున్న అధికారులు రాత్రి పొద్దుపోయే వరకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలించినా ఫలితం దక్కలేదు. దీంతో శుక్రవారం ఉదయం నుంచే గాలింపుమొదలుపెట్టగా ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈమేరకు ఘటనా స్థలంలో పంచనామా అనంతరం మృతదేహాలను మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం తర్వాత కుటుంబీకులకు అప్పగించారు. ఒకేరోజు గ్రామానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో బంజర గ్రామంలో విషాదం అలుముకుంది. మృతుల కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా రోదిస్తుండడంతో గ్రామస్తులంతా కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు బానోతు శ్రీను తదితరులు మృతుల కుటుంబాలను పరామర్శించారు.

'ఇగ్నో'లో ప్రవేశాలు

ఖమ్మం సహకారనగర్: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం(ఇగ్నో)లో డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలోని సెంటర్ ఉండగా, శుక్రవారం ఆయన వివిధ కళాశాలల విద్యార్థులతో సమావేశమయ్యారు. ఇగ్నోలో పలు కోర్సులు అందుబాటులో ఉండగా, ప్రవేశాలకు ఈనెల 15లోగా దరఖాస్తుకు అవకాశముందని తెలిపారు. పూర్తి వివరాలకు 90005 51035 నంబర్‌లో లేదా కోఆర్డినేటర్ రమణారావు, అధ్యాపకులు పాపారావు, వెంకటేష్‌ను సంప్రదించాలని సూచించారు.

కేయూ దూరవిద్య ప్రవేశాలకు 11వరకు గడువు

ఖమ్మం సహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఖమ్మం పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి తెలిపారు. డిగ్రీ, పీజీలో కలిపి 43 కోర్సులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్ లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని వివరాలకు కేయూ దూరవిద్య వెబ్‌సైట్‌తో పాటు 80088 11998 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రెండు ప్రైవేట్ ఆస్పత్రులు సీజ్



మార్వెల్ ఆస్పత్రిని సీజ్ చేస్తూ బాధ్యులకు నోటీసులు ఇస్తున్న డీఎంహెచ్ఓ

ఖమ్మంవైద్యవిభాగం: నిర్లక్ష్యంగా వైద్యం అందించి ఓ మహిళ మృతికి కారణమైన ఖమ్మంలోని బ్రీత్ ఆస్పత్రిని సీజ్ చేసినట్లు డీఎంహెచ్ఓ కళావతిబాయి తెలిపారు. గతనెల 23న తల్లాడకు చెందిన కె.శ్రీదేవి(34) ఖమ్మం మయూరిసెంటర్‌లోని బ్రీత్ ఆస్పత్రిలో చేరగా చికిత్స చేస్తుండగానే ప్రాణాలు కోల్పోయింది. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు ఘటనకు కారణమని తేలడంతో ఇటీవల సమీక్షలో అధికారులను కలెక్టర్ అనుదీప్ మందలించారు. దీంతో డీఎంహెచ్ఓ, ప్రోగ్రాం అధికారి చందునాయక్ శుక్రవారం ఆస్పత్రిలో తనిఖీ చేపట్టి సీజ్ చేశారు. అలాగే, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించారు.

నకిలీ బిల్లుల కేసులో 'మార్వెల్'

ఖమ్మం వైరారోడ్డులోని మార్వెల్స్ ఆస్పత్రిని సైతం అధికారులు సీజ్ చేశారు. ఇక్కడ సుమారు 168 మందికి చికిత్స చేయకున్నా నకిలీ పత్రాలు సృష్టించి సీఎంఆర్ఎఫ్ ద్వారా బిల్లులు తీసుకున్నారు. ఈ విషయమై అందిన ఫిర్యాదుతో తనిఖీ చేపట్టి సీజ్ చేశామని డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి తెలిపారు. అక్కడి పేషంట్లను ప్రభుత్వ ప్రధానాస్పత్రికి తరలించడమే కాక ఆస్పత్రి బాధ్యులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వెల్లడించారు.

ఓయూ నుంచి డాక్టరేట్


ధర్మపురి మధు

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయికి చెందిన ధర్మపురి మధుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఉపేందర్ పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ప్రస్తుతం మధు హైదరాబాద్ హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

16మంది పేకాటరాయుళ్లు అరెస్ట్

తల్లాడ/తిరులాయపాలెం: తల్లాడ మండల కేంద్రంతో పాటు అన్నారుగూడెంలో పేకాట స్థావరాలపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ ఆధ్వర్యాన దాడులు నిర్వహించగా అన్నారుగూడెంలో తొమ్మిది మంది, తల్లాడ మామిడి తోటలో నలుగురిని అరెస్ట్ చేశారు. వీరినుంచి రూ.14,390 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే, తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణిలో పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేయగా ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదంలో తెగిపడిన చేయి


తీవ్రగాయాలతో ఆంధ్రాబాబు

కల్లూరు: మండలంలోని చెన్నూరు సమీపాన గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నకోరుకొండికి చెందిన నామా ఆంధ్రాబాబు టాటా ఏస్‌లో కల్లూరు వస్తున్నాడు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న టిప్పర్ వాహనాన్ని ఢీకొట్టగా, బయట పెట్టిన ఆయన చేయికి తాకడంతో తెగిపడింది. ఈమేరకు తీవ్రంగా గాయపడిన బాబును ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

మార్కెట్ ఉద్యోగిపై కేసు నమోదు

ఖమ్మంక్రైం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌పై దాడి చేసి ఘటనలో అసిస్టెంట్ సెక్రటరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. మార్కెట్‌లో పనిచేస్తున్న తాడేపల్లి చంద్రకాంత్‌ను గత నెల 23న అసిస్టెంట్ సెక్రటరీ వీరాంజనేయులు దూషిస్తూ అంతు చూస్తానంటూ మెడ పెట్టి గెంటేశాడు. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేశామని ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు.

రైతులకు చుట్టాలుగా చట్టాలు..

పలు మండలాల్లో సాగు న్యాయయాత్ర


మధిర రైతువేదికలో మాట్లాడుతున్న సునీల్

మధిర/ఖమ్మం రూరల్/ఎర్రుపాలెం/బోనకల్: ఏ చట్టం చేసినా రైతులకు అండగా నిలిచేలా ఉండాలని.. ఈ విషయమై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యాన సాగు న్యాయ యాత్ర నిర్వహిస్తున్నామని న్యాయవాది, భూహక్కులు, వ్యవసాయ చట్టాల నిపుణుడు సునీల్ తెలిపారు. మధిర, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు, బోనకల్, ఎర్రుపాలెంలో శుక్రవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ(లీఫ్స్) సంస్థ సహకారంతో జూన్ 28న మొదలైన యాత్ర అక్టోబర్ 2వరకు 2,400 కి.మీ. మేర సాగనుండగా 8వేల గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో దాదాపు 450 రెవెన్యూ గ్రామాల్లో భూముల సర్వే చేపట్టగా, లైసెన్స్‌డ్ సర్వేయర్లు త్వరలోనే విధుల్లో చేరనున్నారని పేర్కొన్నారు. అనంతరం రైతుల భూహక్కుల సమస్యలు, నకిలీ విత్తనాలు, ఎరువులు, పంటల బీమాపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమాల్లో భూభారతి రూపకర్తల్లో ఒకరైన బి.హరివెంకటప్రసాద్, భూదాన్ బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి, లీఫ్స్ సంస్థ ప్రతినిధులు జీవన్, అభిలాష్, మల్లేష్, రవి, ప్రవీణ్‌తో పాటు తహసీల్దార్లు రమాదేవి, పి.రాంప్రసాద్, ఉషాశారద, ఏఓలు సాయిదీక్షిత్, పి.వినయ్‌కుమార్, ఉమానగేష్, మధిర మార్కెట్ బండారు నరసింహారావు, వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కడియం శ్రీనివాసరావు, ఏఈఓలు బి.రజిత, పి.అనూష, ఎం.త్రివేణి, జి.హరికృష్ణ, షేక్ హుస్సేన్ సాహెబ్, ఎస్.నాగసాయి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట ధ్వంసంపై ఆగ్రహం

నిందితుడికి పోలీసుస్టేషన్ ఎదుటే దేహశుద్ధి


స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన గ్రామస్తులు

కారేపల్లి: ఏపుగా ఎదిగిన పత్తి పంటను ఓ వ్యక్తి ట్రాక్టర్‌తో ధ్వంసం చేయడంతో ఊరంతా ఏకమైంది. ఆయన అక్రమమార్గంలో పట్టా చేసుకోవడమే కాక పదేళ్లుగా రైతుబంధు నిధులు కాజేస్తూ ఇప్పుడు పత్తి పంటను ధ్వంసం చేయడంతో పోలీసుస్టేషన్ ఎదుటే దేహశుద్ధి చేసిన ఘటన ఇది. మండలంలోని గోవింద్‌తండా గ్రామానికి చెందిన బర్మావత్ భద్రు, ఆయన కుమారుడు దివ్యాంగుడైన సురేష్ తమకు ఉన్న రెండెకరాల్లో ఎకరం భూమిని 1998లో అదే గ్రామానికి చెందిన బర్మావత్ రాందాస్‌కు విక్రయించాడు. అయితే, రెండెకరాలకు లింకు డాక్యుమెంట్‌ను తీసుకున్న ఆయన అక్రమమార్గంలో మొత్తానికి పట్టా చేయించుకున్నాడని, ఇటీవల భూమి తనదేనని దౌర్జన్యం చేస్తున్నాడని భద్రు ఆరోపిస్తున్నాడు. ఈక్రమంలోనే ఏపుగా పెరిగిన పత్తి పంటను ధ్వంసం చేశాడు. దీంతో ఇరు పక్షాలు కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, భద్రు, సురేష్‌కు మద్దతుగా ఊరంతా ట్రాక్టర్లపై పోలీసు స్టేషన్‌కు వచ్చి ఆందోళన చేపట్టారు. ఇంతలోనే అక్కడకు వచ్చిన రాందాస్‌కు దేహశుద్ధి చేయగా సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ బి.గోపి వారిని చెదరగొట్టి రాందాస్‌ను స్టేషన్‌లోకి తీసుకెళ్లారు. కాగా, పత్తి చేను ధ్వంసం చేసిన రాందాస్‌తో పాటు స్టేషన్ ముందు ఆందోళన చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రుణాలు చెల్లించాలని రైతులకు నోటీసులు

రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన

రఘునాథపాలెం: కాంగ్రెస్ ఎన్నికల హామీగా ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ పలువురు రైతులకు అమలు కాకపోగా.. అప్పు చెల్లించాలని బ్యాంకుల నుంచి నోటీసులు వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. రఘునాథపాలెం మండలానికి చెందిన పలువురు రైతులు కామేపల్లి మండలం పండితాపురంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ నుంచి వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. వీరిలో చాలా మందికి రుణ మాఫీ కాలేదు. అయితే, భార్యాభర్తల పేరిట కలిపి తీసుకున్న రుణం రూ.2లక్షలకు మించడంతో మాఫీ కాలేదని బ్యాంకు అధికారులు చెబుతుండగా.. చెల్లించాలని నోటీసులు జారీ అవుతున్నాయి. ఇప్పటికే మండలంలోని బద్యాతండాకు చెందిన 30 మంది రైతులకు నోటీసులు రావడం.. వ్యవసాయ అవసరాలకు కొత్త రుణాలు ఇవ్వకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ రుణాలు మాఫీ చేయడమే కాక కొత్త రుణాల మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

అన్నం ఫౌండేషన్‌కు దివ్యాంగురాలి తరలింపు

దుమ్ముగూడెం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలు గర్భం దాల్చగా సంరక్షణ నిమిత్తం ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. దివ్యాంగురాలికి తల్లి లేకపోవడంతో తండ్రి సంరక్షణలో ఉంటోంది. ఇటీవల ఆమె అనారోగ్యానికి గురవడంతో ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా గర్భం దాల్చిన విషయం బయటపడింది. దీంతో ఐసీడీఎస్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఆమె సంరక్షణ చూసేవారు లేకపోవడంతో ఖమ్మంకు అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. ఈమేరకు ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు బాధితురాలిని వాహనంలో ఖమ్మం తీసుకెళ్లారు.